విస్తారంగా కురుస్తున్న వర్షాలు

- ముంపులో పంట పొలాలు
- పొంగుతున్న వాగులు
- స్తంభించిన జనజీవనం



ఇబ్రహీంపట్నం ఎ.కాలనీలో ఈదురు గాలులకు కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం, ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు శనివారం జలమయమయ్యాయి. అధిక వర్షాలతో ఏనుగుగడ్డ వాగుకు వరదనీరు చేరింది. చిలుకూరు, మూలపాడు, జూపూడి, చినలంక వద్ద ఉన్న సప్టాలపై వరద నీరు ప్రవహిస్తోంది. ఏక్షణమైన ప్రవాహం పెరిగి రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. వర్షం నీటితో వరి పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. ఇబ్రహీంపట్నంలో వీచిన ఈదురు గాలులకు ఎన్టీటీపీఎస్ ఎ.కాలనీలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్టు కూలి కారుపై పడటంతో కారు పైభాగం పాక్షికంగా దెబ్బతింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావం చిరువ్యాపారులు, రోజువారీ కూలీలపై పడింది. వర్షం కొనసాగితే పంటలకు అపార నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనసాగుతున్న ముసురు..

నూజివీడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నియోజకవర్గ పరిధిలో శనివారం కూడా ముసురు వాతావరణం నెలకొంది. వేకువజాము నుంచి ఒక మోస్తరు నుంచి చిరు జల్లులు పడుతూనే ఉండటంతో ప్రజలు, రైతులు, రైతు కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్ల వద్దే ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు విధులకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. మూడు రోజుల పాటు ముసురు నెలకొని ఉండటంతో వ్యాపారాలు సాగలేదని పలువురు వ్యాపారులు వాపోయారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి నియోజకవర్గంలో 265.4 మి.మీ వర్షపాతం నమోదైంది. నూజివీడులో 98.6 మి.మీ, ఆగిరిపల్లిలో 59.6 మి.మీ, ముసునూరులో 40.2 మి.మీ, చాట్రాయిలో 67 మి.మీ వర్షపాతం నమోదైంది.



చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగులో ప్రవహిస్తున్న వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్



త్రిలోచనాపురంలో ముంపునకు గురైన వరి పైరు

తమ్మిలేరు రిజర్వాయర్‌కు పెరుగుతున్న వరద

చాట్రాయి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి ఎక్కువగా పెరుగుతోంది. శనివారం మండలంలోని చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగు ద్వారా వరదను తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ, ఏఎస్ఐ గజపతి పరిశీలించారు. 67.00 మి.మీ వర్షపాతం నమోదైందని తహసీల్దార్ తెలిపారు.

నేలకూలిన భారీ వృక్షం

ఆగిరిపల్లి: వర్షాలు, ఈదురుగాలులకు శనివారం ఉదయం నెక్కలం గొల్లగూడెం వద్ద భారీ వృక్షం రోడ్డుపై నేలకొరిగింది. వాహనాల రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

అధిక నీటిని బయటకు పంపాలి

చాట్రాయి: వరి నారుమడుల్లో అధికంగా ఉన్న నీటిని బయటకు పంపాలని వ్యవసాయ అధికారి బి. శివశంకర్ అన్నారు. శనివారం మండలంలోని నరసింహారావుపాలెం, చనుబండ, చాట్రాయి గ్రామాల్లోని వరి నాటు వేసిన పొలాలను, వెదజల్లిన వరి సాగును ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

రేపటి వరకు కంట్రోల్ రూమ్

నూజివీడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈనెల 22వ తేదీ వరకు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని ఆర్డీఓ వై. భవానీశంకరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కడైనా, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా కంట్రోల్ రూమ్ ఫోన్ 08656–232717 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశం

నూజివీడు: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. భారీ వర్షాల వల్ల నియోజకవర్గంలో ముంపునకు గురైన ప్రాంతాల వివరాలు, చేపడుతున్న చర్యలపై ప్రభుత్వ అధికారులతో శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్షించారు. సమీక్షలో పాల్గొన్న ఆర్డీఓ భవానీ శంకరి, ఇరిగేషన్ డివిజనల్ ఇంజినీరు సత్యనారాయణలతో పలు అంశాలపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ ముసునూరు, చాట్రాయి, నూజివీడు మండలాల పరిధిలోని వాగులు, పంట కాలువల పరిస్థితిపై ఆరా తీశారు. పంట నష్టం ఎంతమేరకు ఉండవచ్చునని అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. రోడ్లపై భారీ వృక్షాలు విరిగి పడితే వాటిని వెంటనే తొలగించాలని చెప్పారు. భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు తెగి పడటంతో ప్రాణ నష్టం ఎక్కువ ఉంటుందని, ప్రజలు వాటి బారిన పడకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారం తనకు తెలియజేయాలని, దానిని బట్టి తక్షణ చర్యలు చేపడతామన్నారు. సమీక్ష సమావేశంలో వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్‌లో 14 మందికి ఉద్యోగాలు

మైలవరం: దివీస్ లేబరేటరీస్ హైదరాబాద్ యూనిట్ మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి దివీస్ లేబరేటరీస్ హెచ్‌ఆర్ శ్రీరామకృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించి 14 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ వి. ఫణి కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ వెంకటాద్రి పర్యవేక్షించారు.

పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

చాట్రాయి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లంకా నిర్మల అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో విష జ్వరాలు ఉన్నాయని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. రామచంద్రాపురం ఎస్ఎస్‌పీ గేట్లకు మరమతులు చేపట్టాలని ఎంపీటీసీ పోతురెడ్డిపల్లి కృష్ణ కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి

ముసునూరు: భారీ వర్షాల నుంచి ప్రజలను కాపాడేందుకు ముందస్తు చర్యలు చేపట్టి అందరినీ అప్రమత్తం చేస్తున్నామని నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి అన్నారు. ఎంపీడీఓ పద్మావతీ దేవి ఆధ్వర్యంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖల పనితీరు, ప్రణాళికలను వివరించారు. పలు సమస్యలను ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విధ్వంసం ఆపి.. హామీలు అమలు చేయండి

మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు హితవు



విలేకరులతో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: ఎన్నికల్లో గెలుపు కోసం అలవికాని హామీలిచ్చిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక విధ్వంసకర కార్యకలాపాలకు దిగుతోందని తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు ధ్వజమెత్తారు. శనివారం తిరువూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 40 రోజుల్లో రాష్ట్రంలో జరిగిన హింసాకాండ చరిత్రలో ఎక్కడా జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులపై ప్రతి రోజూ హత్యలు, దాడులతో విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడుతున్న తెలుగుదేశం పార్టీ తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

తల్లికి వందనం, రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడు?

పాఠశాలలు తెరచి నెల దాటిపోయినా ఇంతవరకు తల్లికి వందనం కార్యక్రమం ప్రారంభించలేదని, ఖరీఫ్ సీజన్‌లో రైతులు పనులు ప్రారంభించినా రైతులకు పెట్టుబడి సాయం అందజేయలేదని స్వామిదాసు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరా, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, మెగా డీఎస్సీ వంటి హామీలను ఆదిలోనే తుంగలో తొక్కిన టీడీపీ ప్రభుత్వం ఇకనైనా వాటిని ఎప్పుడు అమలు చేస్తుందో నిర్దిష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో తరగని ఆదరణ ఉందని, ఇందుకు వినుకొండలో ఆయన పర్యటనే సాక్ష్యమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలుకు ఆరు నెలలు వేచి చూడాలని తొలుత వైఎస్సార్ సీపీ భావించినా రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసకర పాలనను ఎదుర్కొనేందుకు ప్రజాక్షేత్రంలోకి దిగక తప్పట్లేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మా వెంకటేశ్వరి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

తిరువూరు: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తిరువూరులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాద ఘటనల్లో ఎక్కువగా ద్విచక్ర వాహన చోదకులే మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అపరిమితవేగంతో వెళ్లే వారే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. మోటారు వాహనాలు నడిపే వారు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించి ప్రమాదాల తీవ్రత తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ నబీ, ఎస్ఐ సత్యనారాయణ, ఎంఈఓ శ్యాంకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: రాజకీయాలకు అతీతంగా తిరువూరు అభివృద్ధికి కృషి చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన శనివారం జరిగింది. తిరువూరు పట్టణంలో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధుల సాధనకు కౌన్సిలర్లను ముఖ్యమంత్రి వద్దకు, పురపాలక శాఖా మంత్రి వద్దకు తాను తీసుకు వెళతానని, పట్టణాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. వార్డుల్లో మురుగు కాలువల పూడిక తీతకు, పాత బస్టాండ్ సెంటర్‌లో అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు, మున్సిపల్ కాయగూరల మార్కెట్లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ సమావేశంలో తీర్మానించారు. కమిషనర్ లోవరాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి

ఎ.కొండూరు: రాజకీయాలకు అతీతంగా మండలాభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. ఎ.కొండూరు మండల పరిషత్ సమావేశం కార్యాలయ సమావేశపు హాల్‌లో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలో రూ. 49 కోట్లతో కృష్ణా జలాల సరఫరాకు పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆ పనులు వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. మండలంలోని ప్రతి గ్రామానికి పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ద్వారా కృషి చేస్తానని చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లో ఉన్న ప్రాథమిక అవసరాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని కోరారు. వైద్యాధికారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, బాధితులు ఉంటే మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. అన్ని రంగాలలో వెనుకబడిన ఎ.కొండూరు మండలాన్ని తాను దత్తత తీసుకున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని విద్యార్థులకు గాయాలు

ఇబ్రహీంపట్నం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. సీఐ ఎం.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన చిలకలపూడి రేవంత్‌వర్మ తన స్నేహితుడు ఆకాష్‌తో కలిసి కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఇబ్రహీంపట్నంలో అద్దెకు ఉంటున్న వీరు ఈనెల 18న కళాశాలకు వెళుతూ మూలపాడు జెడ్పీ పాఠశాల వద్ద 65వ నంబర్ హైవేపై బైక్ యూటర్న్ తీసుకుంటున్న సమయంలో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వస్తున్న కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అధిక వర్షాలతో పత్తిలో తెగుళ్ల బెడద

తిరువూరు: కురుస్తున్న వర్షాలతో పత్తి చేలలో తెగుళ్లు వ్యాపించే ప్రమాదం ఉన్నందున రైతులు నివారణ చర్యలు చేపట్టాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పైర్లను శనివారం ఆమె పరిశీలించారు. పత్తి పైరు 20 నుంచి 30 రోజుల దశలో ఉన్నందున భారీ వర్షాల కారణంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. పొలంలో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు తీసివేయాలని చెప్పారు. నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రు వేసి అంతర కృషి చేస్తే త్వరగా ఆరుతుందని, తేలిక నేలలో ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయడం ద్వారా పంటను కాపాడుకోవచ్చన్నారు. పలు సూచనలు చేశారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు

తిరువూరు: విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికిపోవద్దని, వాటి బారిన పడితే విలువైన జీవితాలు నాశనమవుతాయని తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ అశోక్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు బలి కావద్దన్నారు. స్వార్థపరులు కొందరు పాఠశాలలు, కళాశాలల సమీపంలోనే వీటి అమ్మకాలు సాగిస్తూ అమాయకుల జీవితాలు బలి తీసుకుంటున్నారని చెప్పారు. అనంతరం మాదక ద్రవ్యాల జోలికి పోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, అర్హత కలిగిన వారు ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రధానాధికారి దేవరకొండ భూషణం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని ఈనెల 24వ తేదీలోగా కళాశాలకు వచ్చి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 27న ఐటీఐ కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఉదయం 9 గంటల కల్లా హాజరు కావాలని చెప్పారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

నూజివీడు: తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదానానికి 12 టన్నుల కూరగాయలను వితరణగా పంపించారు. దేవరగుంటకు చెందిన నక్కా సత్యనారాయణ దేవరగుంటతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూరగాయలను సేకరించి తిరుమల నుంచి వచ్చిన ప్రత్యేక వాహనంలో శనివారం కూరగాయలను పంపారు. తొలుత పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్లు అందజేత

విస్సన్నపేట: స్థానిక పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు, రెయిన్‌కోట్లను సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి శనివారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ హరికృష్ణకుమార్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మందపాటి సత్యనారాయణరెడ్డి, వార్డు సభ్యుడు నెక్కళపు కుటుంబరావు, జూనియర్ అసిస్టెంట్ స్వాతి పాల్గొన్నారు.

నాణ్యమైన మాంసం ఉత్పత్తులు విక్రయించాలి

మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మాంసం ఉత్పత్తులు విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మాంసం, చేపల విక్రయదారులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మాంసం విక్రయదారులు వాణిజ్యపరమైన లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మాంసం, చేపల విక్రయాలు బహిరంగ ప్రదేశాల్లో అమ్మకాలు జరిపి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. చట్టపరిధిలో వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాలతో ప్రజారోగ్య సమస్యలు తలెత్తితే మున్సిపాల్టీ చట్టపరిధిలో కఠిన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఆర్ఐ రవితేజ, మాంసం, చేపల దుకాణదారులు పాల్గొన్నారు.

25 వరకు హిందీ పరీక్షల దరఖాస్తులకు అవకాశం

తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ వార్షిక పరీక్షలకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 25వ తేదీతో ముగుస్తుందని ప్రచారక్ రేపాక రఘునందన్ తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరుగనున్న హిందీ వార్షిక పరీక్షలకు దరఖాస్తు రుసుం చెల్లింపునకు ఈ నెల 25 వరకు గడువు విధించిన ప్రచార సభ మరో ఐదు రోజుల పాటు అపరాధ రుసుంతో అవకాశం కల్పించిందని చెప్పారు. వివరాలకు సెల్: 94408 48924 నంబరులో సంప్రదించాలని సూచించారు.

డ్రెయిన్లలో పూడిక తీత

మైలవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మైలవరం పట్టణంలోని తారక రామా నగర్, ఎన్టీఆర్ కాలనీలో డ్రెయినేజీలు పూడుకుపోయి వర్షం నీరు రోడ్లపై నిలబడటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. జేసీబీ ఏర్పాటు చేసి పంచాయతీ సిబ్బందితో పూడిక తీయించి మురుగునీటి ప్రవాహాన్ని ప్రధాన కాలువలోకి మళ్లించారు.

గుంత పూడ్చివేత

మైలవరం రామాలయం వీధిలో ఏర్పడిన గుంతను ఇటుక ముక్కలు, మట్టి వేసి పంచాయతీ కార్మికులు పూడ్చారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిమ్రా అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా మెడికల్ కళాశాల అధ్యాపకుడు షేక్ జాన్‌బాషాకు తమిళనాడుకు చెందిన సవిత యూనివర్సిటీ అధికారులు శనివారం పీహెచ్‌డీ ప్రదానం చేశారు. 'ఎవల్యూషన్ ఆఫ్ ప్లాస్మా నైట్రో థైరోసిస్ ఎపిలిన్ యాజ్ నావెల్ బయోమార్కర్స్ ఆఫ్ ఇన్సులిన్ రెసిస్టెన్సీ ఇన్ టైప్–2 డయాబెటీస్ మిల్లిటస్ పేషెంట్స్ అంశంపై డాక్టర్ డి.షీలా పర్యవేక్షణలో మధుమేహ వ్యాధిగ్రస్తులపై రూపొందించిన పరిశోధనా పత్రాన్ని యూనివర్సిటీకి ఆయన సమర్పించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి, మెడికల్ కళాశాల డీన్ కృష్ణమూర్తి, రీసెర్చ్ డైరెక్టర్ బాబూలాల్ తదితరులు జాన్‌బాషాను అభినందించారు.

సంక్షిప్తం

• కార్మికులకు ఆర్థిక సాయం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ 5వ దశ బాయిలర్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొదుతున్న కార్మికులకు ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు శనివారం ఆర్థిక సహాయం అందించారు. గొల్లపూడి ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఉద్యోగి చక్రధర్, కాంట్రాక్ట్ కార్మికుడు వి.అప్పారావుకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేశారు. కార్మిక నాయకులు పాల్గొన్నారు.

• దుర్గమ్మకు ఆషాఢ సారె

ముసునూరు: బెజవాడ కనక దుర్గమ్మకు కాట్రేనిపాడు శివారు హరిశ్చంద్రపురానికి చెందిన పలువురు మహిళలు శనివారం ఆషాఢ సారె సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ గోగినేని కృష్ణభారతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

• రాజరాజేశ్వరి దేవికి..

బలివే(ముసునూరు): బలివే రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని రాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి భక్తులు ఆషాఢ సారె, పసుపు కుంకుమలు సమర్పించారు. వెంకటాపురానికి చెందిన 20 మంది మహిళలు శనివారం బలివేలోని రామలింగేశ్వస్వామి ఆలయం వద్దకు వెళ్లి రాజరాజేశ్వరి అమ్మవారికి ఆషాఢ చీర, సారె, పసుపు కుంకుమలు సమర్పించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అర్చకులు చావలి అమర్‌బాబు పూజాదికాలు నిర్వహించారు.

• ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ

ముసునూరు: ముసునూరు ఎస్సీ బాలికల హాస్టల్‌ను శనివారం నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టడీ అవర్‌లో ఉన్న టెన్త్ విద్యార్థినులతో మాట్లాడి భోజన రుచి, శుచిపై ఆరా తీశారు. విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. భోజనం రుచికరంగా మెనూ ప్రకారం వడ్డించాలని ఆదేశించారు. ఎంపీడీఓ పద్మావతీదేవి, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

• రైతులను ఆదుకోవాలి

నూజివీడు: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి. హరినాథ్ కోరారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో ప్రాణ నష్టం లేకున్నా పంట నష్టం, రహదారులకు నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం తక్షణ సాయం ప్రకటించడంతో పాటు విత్తనాలు, ఎరువులను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు.

• పొలాల పరిశీలన

ఆగిరిపల్లి: మండలంలోని సగ్గూరు, కృష్ణవరంలో నీట మునిగిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి పల్లగాని చెన్నారావు శనివారం పరిశీలించారు. వర్షాలకు నారుమడుల్లో చేరిన నీటిని బయటకు తోడాలని ఆయన చెప్పారు. రైతులకు ఆయన పలు సూచనలు చేశారు.

• ఉద్యాన పంటలకు నష్టం లేకుండా చర్యలు

నూజివీడు: అధిక వర్షాలకు ఉద్యాన పంటలకు నష్టం కలుగకుండా రైతులు చర్యలు చేపట్టాలని నూజివీడు ఉద్యాన అధికారి ఆర్. హేమ అన్నారు. నూజివీడుతో పాటు మండలంలోని జంగంగూడెం, దేవరగుంటలో శనివారం బొప్పాయి, తీగజాతి కూరగాయల పంటలను ఆమె సందర్శించి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

• 25న దేవస్థానం షాపులకు వేలం

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో షాపుల అద్దె హక్కునకు ఈ నెల 25వ తేదీన టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వై. సీతారామయ్య శనివారం తెలిపారు. దేవస్థానం వద్ద పాల పొంగళ్లకు గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చే హక్కునకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు ఆలయ కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలన్నారు.

• బీమా చెక్కు అందజేత

విస్సన్నపేట: విస్సన్నపేట ఇండియన్ బ్యాంక్ శాఖలో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన సురక్ష బీమా పథకాల లబ్ధిదారుడు చిన్ని శ్రీనివాసరావు కుటుంబానికి బీమా చెక్కు అందజేశారు. ఇటీవల ప్రమాదంలో చిన్ని శ్రీనివాసరావు మృతి చెందాడు. నామినీగా ఉన్న అతని భార్య చిన్ని నాగలక్ష్మికి రూ.4 లక్షల చెక్కును శనివారం ఇండియన్ బ్యాంక్‌లో అందజేశారు. బ్యాంక్ జోనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్, బ్రాంచి మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.